# పల్లెలు పచ్చదనంతో పరిఢవిల్లాలి

- ఆకుపచ్చ తెలంగాణే సీఎం కేసీఆర్ ధ్యేయం
- హరిత తెలంగాణకు అందరూ కృషి చేయాలి
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పాలకుర్తిలో ఘనంగా హరితోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్, జూన్ 19 : పల్లెలు పచ్చదనంతో పరిఢవిల్లాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరాల శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పాలకుర్తి మండలకేంద్రంలోని మాంగళ్య గార్డెన్ ఆవరణలో హరితోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి గార్డెన్ ఆవరణలో మొక్కలు నాటారు. హరిత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఆకుపచ్చ తెలంగాణే సీఎం కేసీఆర్ ధ్యేయమని, హరితహారంలో భాగంగా ఈ పదేళ్ల కాలంలో కోట్లాది మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములైనట్లు తెలిపారు. మొక్కలను పెంచడం మన ఇంటి పనిలా భావించాలని సూచించారు. అభివృద్ధిలో పరుగులు పెడుతున్న గ్లోబల్ యుగంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఇంట్లో మన పిల్లలను సాదుకున్నట్లు మొక్కలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. జనగామ జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 4కోట్ల మొక్కలు నాటినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 14, 864 నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నట్లు చెప్పారు. పల్లె ప్రగతిలో భాగంగా 19,472 పల్లె ప్రకృతి వనాలు, 75,440 ఎకరాల్లో పార్కులను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 24.53కోట్ల మొక్కలు నాటామన్నారు. జనగామ జిల్లాలో 28లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయి, పదో సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం వన సేవకులకు, ఉపాధి హామీ సిబ్బందికి ఉత్తమ అవార్డులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీపీవో రంగాచారి, డీఆర్డీవో గూడూరు రాంరెడ్డి, జిల్లా ఆటవీశాఖాధికారి వసంత, తహసీల్దార్ భూక్యా పాల్‌సింగ్, ఎంపీడీవో వనపర్తి అశోక్‌కుమార్, సీఐ డీ విశ్వేశ్వర్, ఏపీవో అంబాల మంజుల, ఎంపీపీ నల్లానాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మధార్, సర్పంచ్‌లు యాకాంతారావు, నాగభూషణం, మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పాలకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, అటవీశాఖ సిబ్బంది అఖిల్, వైస్ ఎంపీపీ శంకరయ్య, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య పాల్గొన్నారు.



విద్యుత్ కాంతుల్లో జీడికల్ దేవస్థానం

## ముస్తాబైన జీడికల్ ఆలయం

లింగాలఘనపురం, జూన్ 19: ఆధ్యాత్మికోత్సవానికి జీడికల్ దేవాలయం ముసాబవుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో భద్రాద్రిగా ప్రఖ్యాతిగాంచిన ఈ ఆలయం సీమాంధ్రుల పాలనలో ఆదరణకు నోచుకోలేదు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సూచనతో జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఎమ్మెల్సీ పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఆలయ పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించి ఆయన ఆలయ అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.4 కోట్లను కేటాయించారు. వాటితో ఆలయానికి ప్రాకార మహామండప నిర్మాణం, చుట్టూ సీసీ రోడ్లు, డివైడర్ల ఏర్పాటు చేయడంతో ఆలయం సరికొత్త కొత్తశోభను సంతరించుకుంటుంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21న ఆధ్యాత్మికోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మొక్కలు నాటడం ఉద్యమంలా చేపట్టాలి
- వాటితోనే మానవ మనుగడ
- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- మొక్కలు నాటడంతోపాటు సంరక్షించాలి
- కలెక్టర్ కే శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, జూన్ 19 : పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహబూబాబాద్‌లో హరితోత్సవ కార్యక్రమాన్ని జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట జిల్లా ఫారెస్ట్ అధికారులు బస్టాండ్ సెంటర్ నుంచి మదర్ థెరిస్సా సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ శివారులోని జమాండ్లపల్లి అర్బన్ పార్క్‌లో ఎమ్మెల్యే శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మొక్కలను నాటారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఫారెస్ట్ అధికారి రవికిరణ్ హరితహారానికి సంబంధించిన ప్రగతి నివేదికను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. ముందుగా ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన హరితహారం ద్వారా ఇప్పటివరకు లక్షలాది మొక్కలు నాటినట్లు తెలిపారు. కెనడా, రష్యా వంటి దేశాల్లో మొక్కల సంఖ్య ఎక్కువ సంఖ్యలో నాటుతారని, అక్కడ భూ విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందన్నారు. భారత దేశంలో జనాభా ఎక్కువగా ఉండి భూమి విస్తీర్ణం తక్కువగా ఉండడం వల్ల మొక్కల సంఖ్య తక్కువగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హరితహారం విశిష్ఠతను ప్రతి ఒక్కరూ గుర్తించి ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. మొక్కలను నాటడం ఒక సామాజిక బాధ్యతగా తీసుకుని ఉద్యమంలా కొనసాగించాలన్నారు. పర్యావరణంలో 33శాతం ఉండాల్సిన అడవులు కేవలం 23 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. అందుకే సకాలంలో వర్షాలు కురవక ప్రజలు ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఇంట్లో తప్పని సరిగా మామిడి, జామ, నిమ్మ, మొక్కలే కాకుండా పూలమొక్కలను సైతం నాటాలన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచన విధానంతోనే నేడు హరితహార కార్యక్రమం ద్వారా ఎన్నో రకాల మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కలు మానవ మనుగడకు ఎంతో సహాయం చేస్తాయన్నారు. కాగా, హరితహారంపై పాఠశాల విద్యార్థులకు పోటీలను నిర్వహించి ప్రతిభ గల చూపిన వారికి కలెక్టర్, ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శరత్ చంద్రపవార్, అదనపు కలెక్టర్ అభిలాషాఅభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేశ్వర్ కుమార్, జిల్లా అధికారులు, ఫారెస్ట్ ఎఫ్ఆర్వోలు, డీఆర్వోలు , బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



మహబూబాబాద్ మదర్‌థెరిస్సా సెంటర్ నుంచి ర్యాలీని జెండాఊపి ప్రారంభిస్తున్న అధికారులు, చిత్రంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, ప్రజాప్రతినిధులు



ఎల్లంపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న విద్యుత్ సిబ్బంది

## హరితయజ్ఞంతో సత్ఫలితాలు

- విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలి
- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ, జూన్ 19 : పర్యావరణ పరిరక్షణ సీఎం కేసీఆర్ లక్ష్యం అని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అబ్బాయిపాలెం, గాలివారిగూడెం గ్రామాల్లో హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యంతో జీవకోటి మనుగడకు పెనుముప్పు వాటిల్లినున్నదన్నారు. విషమిస్తున్న పరిస్థితిని గమనించిన సీఎం కేసీఆర్ హరితహారం అనే మహాయజ్ఞాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తొమ్మిదో విడుత హరితహారంలో భాగంగా డోర్నకల్ నియోజకర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు, వ్యాపార, వాణిజ్య సముదాయాలలో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నాటిన మొక్కలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో హరితయజ్ఞంతో అడవులు విస్తృతంగా పెరిగి వన్యప్రాణులకు రక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, ఎంపీపీ గుగులోత్ అరుణారాంబాబు, జడ్పీటీసీ తేజావత్ శారదారవీంద్రనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరాకుమారి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, నాయకులు ఆయూబ్ పాషా, కవితారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నారెడ్డి సుదర్శన్‌రెడ్డి, జినుక ఇద్దయ్య, కృష్ణ పాల్గొన్నారు.

అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో సిబ్బంది మొక్కలు నాటారు. పర్యావరణ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ట్రాన్స్‌కో ఏడీఏ లోక్‌నాథరెడ్డి, ఏఈ అన్నవరపు పావని అన్నారు. ఎల్లంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు జర్పుల కాలూనాయక్, పదిర సైదులు, బిక్కు, మాలు పాల్గొన్నారు.